క్లుప్తంగా

రాష్ట్ర ఎరుకుల సేవా సంఘం మహిళా కార్యదర్శిగా సుజన


సుజన

వింజమూరు(ఉదయగిరి): ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ మహిళా కార్యదర్శిగా వింజమూరు పంచాయతీ సర్పంచ్ నల్లగొండ్ల సుజన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అధికారులు, ప్రజలు ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ ఎరుకల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని, ఎరుకలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐలు

ఉదయగిరి: గంజాయి అక్రమ రవాణా చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఉదయగిరి సీఐ గిరిబాబు, కోవూరు సెబ్ సీఐ నరహరి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తుంటే వారిపై దృష్టి సారించి సంబంధిత శాఖలకు సమాచారం అందించాలన్నారు. నిషేధిత గంజాయి ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. గంజాయి విక్రయించినా, అక్రమ రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

51 మంది రక్తదానం



వరికుంటపాడు: రక్తదాత, రక్తదాన చైతన్యకర్త మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన పచ్చల లక్ష్మయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు పచ్చవ పెదవెంగయ్య, చినవెంగయ్య, భూమయ్య జేవీవీ మండల శాఖ సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 51 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయాలన్నారు. అనంతరం పలువురు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు వెంకటసుబ్బయ్య, చెన్నకేశవులు, రమణయ్య, పీఎం చలం, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, పి.తిరుపతిరెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులో సోమవారం ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్‌లు ఊరిబిండి ప్రశాంతి, రాపూరు ఇంద్రావతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. వలంటీర్లకు ప్రచార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైర్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరురూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న వరి, పత్తి, పొగాకు, తదితర పైర్లు భారీ వర్షాలు కారణంగా దెబ్బతినకుండా రైతులు జాగ్రత్త వహించాలని ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ దేవసేనమ్మ, ఏఓ కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని వాశిలి, బట్టేపాడు, అప్పారావుపాళెం, బోయలచిరివెళ్ల గ్రామాల్లో వరి నాట్లు జరుగుతున్న పొలాలను సోమవారం వారు పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటికి పంపించేందుకు రైతులు తప్పక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గే వరకు కొత్తగా పొగాకు నాట్లు వేయవద్దన్నారు.

ఘనంగా వంటేరు జన్మదిన వేడుకలు

జలదంకి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సలహామండలి సభ్యుడు, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఆయన అభిమానులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. బ్రాహ్మణక్రాకలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం, కావలిలోని ఆయన కార్యాలయంలో కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బ్రాహ్మణక్రాక ఎస్సీ కాలనీ, 9వ మైలు ఎస్టీ కాలనీల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

బాలుడు ప్రత్యక్షం

మర్రిపాడు: ప్రకాశం జిల్లాకు చెందిన 12 ఏళ్ల బాలుడు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఆ బాలుడు ఆదివారం రాత్రి మర్రిపాడులో ప్రత్యక్షమయ్యాడు. అనుమానస్పదంగా తిరుగుతుండగా కొందరు యువకులు ఆ బాలుడిని చేరదీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక హాస్టల్‌లో వసతి కల్పించారు. బాలుడు భయపడి ఇంటి నుంచి వచ్చాడని తెలుసుకుని అతని తల్లిదండ్రుల చెంతకు చేర్చేందుకు వారికి సమాచారం అందించారు.

తూర్పుతీరం అల్లకల్లోలం

- ఉగ్రరూపం దాల్చిన కడలి
- 15 మీటర్ల ముందుకు చొచ్చుకు వస్తున్న సముద్రం
- భారీ ఈదురు గాలులు, వర్షం
- పలుచోట్ల విరిగిపడిన స్తంభాలు, చెట్లు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం


ఇస్కపల్లి సముద్ర తీరంలో దెబ్బతిన్న బోట్లను, వలలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: బంగాళాఖాతంలో ఉగ్రరూపం దాల్చిన 'మిచాంగ్' తుఫాన్ ప్రభావంతో తూర్పుతీరంలో అలజడి నెలకొంది. రెండు రోజుల నుంచి సముద్రంలో ఒక మాదిరిగా ఎగసిపడుతున్న అలలు సోమవారం తెల్లవారుజాము నుంచి తీవ్రమయ్యాయి. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలతో తీరమంతా అల్లకల్లోలంగా మారింది. తాటిచెట్లపాళెం వద్ద సముద్రం సుమారు 15 మీటర్లకుపైగా ముందుకు దూసుకువచ్చింది. పలుచోట్ల అలల తాకిడికి ఒడ్డు భారీగా కోతకు గురైంది. సుమారు 3 నుంచి 5 మీటర్ల ఎత్తులో రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. అలల ధాటికి సుమారు 10కి పైగా వలలు ఇసుకలో కూరుకుపోయాయి. ఐదు తెప్పలు పాక్షికంగా ధ్వంసమైనట్లు స్థానిక మత్స్యకారులు తెలిపారు. పాతపాళెం వద్ద సముద్రం ఉగ్రరూపం దాల్చింది. అలలు ఉధృతికి సముద్రపు నీరు బకింగ్‌హోమ్ కెనాల్‌లోకి చేరుతుంది. బంగారుపాళెం, కొత్తబంగారుపాళెం, పాతబంగారుపాళెం, అలిచెర్ల బంగారుపాళెం, తాటిచెట్లపాళెం, కడపాళెం, కొత్తకడపాళెం, టెంకాయచెట్లపాళెం మత్స్యకారులు హడలిపోతున్నారు. లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో మోకాలు లోతు నీళ్లు నిలిచాయి. కావలి డీఎస్పీ వెంకటరమణ సిబ్బందితో కలిసి తీరంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే సన్నద్ధంగా ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తుండడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. బోగోలు, విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీతో పాటు తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, పలుచోట్ల తీగలపై చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే అవకాశం లేనట్లు తెలిసింది. కప్పరాళ్లతిప్ప–బోగోలు రోడ్డులో భారీ చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

సాగరంలో ఎడతెరిపిలేని వర్షం

సోమశిల: తుఫాన్ ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుంచి మండలంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పెన్నానది పరీవాహక ప్రాంతాలైన కచిరిదేవరాయపల్లి, కొత్తపల్లి, రేవూరు, బెడుసుపల్లి లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తహసీల్దారు సుభాషిణి పర్యటించారు. స్థానికులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. దేవరాయపల్లి బిట్‌-1లో పూరి గుడిసెల్లో నివాసముంటున్న వారికి ఆ గ్రామ వీఆర్‌ఓ శ్రీనివాస్ భోజనం తయారు చేయించి తహసీల్దారు సుభాషిణి, సర్పంచ్ రమీజాబేగంతో కలిసి పంపిణీ చేశారు.

పునరావాస కేంద్రాలకు తరలించిన ఆర్డీఓ

వర్షప్రభావిత కాలనీ ప్రజలను ఆర్డీఓ మధులత తన వాహనంలోనే పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలోని పాతదేవరాయపల్లి ఎస్సీ కాలనీలోకి నీళ్లు చేరుతాయని అధికారుల సమాచారంతో ఆగమేఘాల మీద అక్కడికి చేరుకున్న ఆర్డీఓ స్థానిక ప్రజలతో మాట్లాడారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. వర్షం అధికంగా ఉండడంతో తన వాహనంలోనే వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. బాధితులను తరలించే క్రమంలో ఓ చిన్నారిని స్వయంగా తన ఒడిలోకి తీసుకుని వాహనంలో ఎక్కించారు. ఆమె వెంట తహసీల్దారు సుభాషిణి, వీఆర్‌ఓ శ్రీనివాస్ ఉన్నారు.

సంగంలో భారీ వర్షం

సంగం: తుఫాన్ ప్రభావంగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో నివాసితులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో గడిచిన 24 గంటల్లో 21.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు నుంచి సంగం సబ్‌స్టేషన్‌కు విద్యుత్‌ను సరఫరా చేసే 33 కేవీ మెయిన్ లైన్ తెగిపోవడంతో ఏడీ శీనయ్య, ఏఈ శ్రీనివాసులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. వర్షాలకు తోడు ఈదురు గాలులు తోవడంతో పలు ప్రాంతాల్లో చిన్నపాటి చెట్లు నేలకొరిగాయి. పెరమన వద్ద విద్యుత్ స్తంభం నేలకూలింది.

అధికార యంత్రాంగం అప్రమత్తం

తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు గ్రామం కోలగట్లలో తహసీల్దారు నాగరాజు, ఎస్సై నాగార్జునరెడ్డి పర్యటించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని సూచించారు. అన్నారెడ్డిపాళెం ఎస్టీ కాలనీలోని 23 కుటుంబాలను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి ఎంపీడీఓ గోపీ తరలించారు. వారికి వసతులు ఏర్పాటు చేశారు. సీఐ రవినాయక్ సర్కిల్ పరిధిలోని అందరూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఏడీ శీనయ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సంగం సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌శాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తుఫాను గాలులకు ఇప్పటికే పలు ప్రాంతాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను, తీగలను పునరుద్ధరించారు. ప్రజలు కరెంట్ స్తంభాలను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే తమ కాల్ సెంటర్‌కు కాని, సబ్‌స్టేషన్‌కు కాని సమాచారం అందించాలని సూచించారు.

మెట్టలో చిరుజల్లులు

ఉదయగిరి: తుఫాను ప్రభావంతో ఉదయగిరి మెట్ట ప్రాంతంలో సోమవారం సాయంత్రం వరకు చిరుజల్లులే కురుస్తున్నాయి. గాలుల ప్రభావం ఓ మోస్తరుగా ఉండడంతో అక్కడక్కడా కొన్ని చెట్లు నేలకొరిగాయి. వింజమూరులో సాగులో ఉన్న అరటితోటలు నేలకొరగడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం మొదలైంది. వరికుంటపాడు, సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు ప్రాంతాల్లో ముసురు పట్టింది. మంగళవారం తుఫాను తీరం దాటుతుందన్న వాతావరణ శాఖ సమాచారంతో వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. వింజమూరులో తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు మండలంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పర్యటించి ముందు జాగ్రత్త చర్యగా అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. చింతలపాళెం ఎస్సీ కాలనీ, జీబీకేఆర్ ఎస్టీ కాలనీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎస్సీ కాలనీల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ తెలిపారు. తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఈదురు గాలులతో కూడిన వర్షం

చేజర్ల: తుఫాన్ ప్రభావంగా మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. ఉదయం తేలికపాటి వర్షాలు ఉన్నప్పటికి మధ్యాహ్నం దాటిన తర్వాత మోస్తరుగా వర్షం కురిసింది. ఆదూరుపల్లిలో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

అప్రమత్తంగా ఉండండి

తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పి.కృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని చిత్తలూరు, చేజర్ల ఎస్టీ కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఇళ్లలోకి నీరు వచ్చి ఇబ్బంది పడే వారి కోసం చేజర్లలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. చేజర్ల ఎస్టీ కాలనీలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు, అత్యవసరమైతే అక్కడికి చేరుకోవాలని సూచించారు.

పునరావాస కేంద్రానికి తరలింపు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు గిరిజనకాలనీ వాసులు 70 మందిని ఆత్మకూరు ఆర్డీఓ కురుబ మధులత సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. చిన్నారులు, వృద్ధులు పూరిగుడిసెల్లో భారీ వర్షం కారణంగా ఇబ్బందులు పడకుండా పునరావాస కేంద్రంలో వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి.. నేనున్నా

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: తుఫాన్ ప్రభావంతో తీరం అల్లకల్లోలంగా ఉందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరం వచ్చిన తానున్నారంటూ మత్స్యకారులకు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని ఇస్కపల్లి తీర గ్రామాల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సోమవారం పర్యటించారు. తమ జీవనాధారమైన బోట్లు, వలలు దెబ్బతిన్నాయని మత్స్యకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో గాలివానను సైతం లెక్కచేయకుండా వానలో తడుస్తూ సముద్ర తీరానికి నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. మత్స్యకారులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, విపత్తు ఎదురై ఎలాంటి నష్టం వాటిల్లినా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి అండగా నిలబడుతామన్నారు. మంగళవారం తుఫాన్ తీరం దాటేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా ఏదైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లలో సంప్రదించాలన్నారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండండి తుఫాన్ విపత్తు సమయంలో నాయకులంతా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. తుఫాన్ నష్ట తీవ్రత తగ్గించేందుకు వీలైంతగా ప్రజలకు సహకారాలు అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ జ్యోతి, ఎస్సై శ్రీనివాసులరెడ్డి, నాయకులు దండా కృష్ణారెడ్డి, సాయికుమార్, బీద రమేష్ ఉన్నారు.

245.8 మి.మీ. వర్షపాతం


ఆత్మకూరులో జోరుగా వర్షం పడుతున్న దృశ్యం

ఆత్మకూరు: తుఫాన్ నేపథ్యంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో భారీ వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు 245.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా సంగంలో 52.6 మి.మీ., ఆత్మకూరు 50.2, ఏఎస్‌పేట 48.8, కలువాయి 31, చేజర్ల 26.2, అనంతసాగరం 20.6, ఉదయగిరి 12.2, మర్రిపాడు 7.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

గిరిజన కాలనీల్లో భోజనం పంపిణీ

ఆత్మకూరు: తుఫాన్ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని మోడల్ ఎస్టీ కాలనీ, వెంకట్రావుపల్లి గిరిజన కాలనీ వాసులకు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ భోజనం సరఫరా చేశారు. కాలనీ వాసులు వర్షాలతో వంట చేసుకోలేని పరిస్థితి ఏర్పడడంతో తన వంతు సాయంగా గిరిజన కుటుంబాలకు సోమవారం రెండు పూటలా భోజనం సరఫరా చేస్తున్నట్లు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

మర్రిపాడు: తుఫాన్‌తో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని ఇర్లపాడు, చుంచులూరు ఎస్సీ కాలనీలను సోమవారం తహసీల్దారు ఆనంద్ రావు, ఆర్‌ఐ సురేంద్ర పర్యటించి కాలనీవాసులతో మాట్లాడారు. రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పడమటినాయుడుపల్లి సమీపంలోని కేతామన్నేరు వాగుపై బ్రిడ్జి, బొగ్గేరును ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి పరిశీలించారు. వాహనచోదకులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొండాపురంలో మోస్తరు వర్షం

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది. మండలంలో 13.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వర్షాలకు పొంగే వాగులు, చెరువు అలుగులు పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏవైనా విపత్తులు సంభవిస్తే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

జలదంకి: తుఫాను ప్రభావం కారణంగా మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఏవీ రమణరావు తెలిపారు. సోమవారం ఆయన జలదంకి, 9వ మైలు, బ్రాహ్మణక్రాక ఎస్సీ కాలనీల్లో ఎస్సై ఆదిలక్ష్మితో కలిసి పర్యటించారు. కాలనీల్లో నివాసముంటున్న వారిని స్థానిక పాఠశాలలకు తరలించి వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ఉండి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. గాలుల తీవ్రత దృష్ట్యా విద్యుత్ తీగలు తెగిపడే అవకాశాలున్నాయని, రైతులు, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


సంగం సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో ఏడీ శీనయ్య

ఎమ్మెల్యే కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు: తుఫాన్ నేపథ్యంలో ప్రజల రక్షణ దృష్ట్యా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఆర్డీఓ, పలువురు తహసీల్దార్లతో ఆయన సోమవారం ఫోన్‌లో మాట్లాడి సూచనలు చేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో తుఫాన్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయించారు. సిబ్బందితో మాట్లాడి నియోజకవర్గంలో ఎక్కడైనా ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వారి నుంచి సమాచారం అందితే వెంటనే సహాయం జరిగేలా కంట్రోల్ రూమ్ నుంచి సహాయ కార్యక్రమాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా పెన్నా పరీవాహక గ్రామాల్లోని ప్రజలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విచారణ చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, సమాచారం కంట్రోల్ రూమ్‌కు అందజేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ఆత్మకూరులో కంట్రోల్ రూమ్ నంబరు 83318 17569, నెల్లూరులోని కార్యాలయంలో 62815 05768 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలు సైతం స్వీయ జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు.

గండిపాళెం క్రస్ట్ గేట్ల పరిశీలన


గండిపాళెం క్రస్ట్‌గేట్లు పరిశీలిస్తున్న డీఈ చంద్రమౌళి

ఉదయగిరి: తుఫాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఉదయగిరి ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి సోమవారం గండిపాళెం ప్రాజెక్ట్‌లోని క్రస్ట్‌గేట్లు పరిశీలించారు. వర్షాలు ఉధృతమై ప్రాజెక్ట్‌లోకి ఎక్కువ నీరు చేరితే గేట్లు ఎత్తివేసే నిమిత్తం గేట్ల పరిస్థితిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి, మంగళవారం ఎగువ ప్రాంతాల నుంచి జలాశయానికి వరద నీరు వచ్చే అవకాశముందున క్రస్ట్‌గేట్లలో సాంకేతిక లోపం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉదయగిరిలో ప్రస్తుతం పెద్దగా వర్షాలు లేనందున చెరువులకు, ప్రాజెక్ట్‌లకు నీరు చేరలేదన్నారు. సోమవారం రాత్రి నుంచి వర్షాలు పెరిగే అవకాశమున్నందున మంగళ, బుధవారాల్లో జలాశయాలు చెరువుల్లోకి నీరు చేరే అవకాశమున్నట్లు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. బలహీనంగా ఉన్న చెరువులను గుర్తించి ఎలాంటి సమస్యలు తలెత్తినా తగు చర్యలు తీసుకునే నిమిత్తం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.


మర్రిపాడు : చుంచులూరు ఎస్సీ కాలనీ వద్ద చప్టాను పరిశీలిస్తున్న తహసీల్దారు ఆనంద్‌రావు


మర్రిపాడు : పడమటినాయుడుపల్లి బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి


మిడతవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు


పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత


ఎస్టీ కాలనీ వారితో మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

గుర్రపుడెక్కను తొలగించండి


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

అల్లూరు: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట కాలువలో గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పెరిగి నీటి పారుదల లేకపోవడంపై చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విడుదల చేసే నీరంతా పంట పొలాలు, గ్రామాలు మునిగిపోవడం జరుగుతుందని రైతులంతా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించారు. ఎమ్మెల్యే అక్కడకు చేరుకొని వెంటనే జేసీబీని తెప్పించి యుద్ధప్రాతిపదికన గుర్రపుడెక్కను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించుకోవాలని సూచించారు.

తమ సమస్యను వెంటనే పరిష్కారం చేసి చూపించిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణాలు రద్దు చేసుకోండి


ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్, ఆర్డీఓలతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: తుఫాన్ ప్రభావంతో చెన్నై– కోల్‌కతా రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలను అధికారులు ముందు జాగ్రత్తగా నిలిపేశారని, కావలి నియోజకవర్గ ప్రజలు ఈ మార్గాల్లో మూడు రోజుల పాటు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ కావలి వద్దే తీరాన్ని దాటుతోందని అధికారులు చెప్పారని, ఆ మేరకు స్వయంగా కలెక్టర్, ఎస్పీ కావలికి వచ్చి ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారుల ను సన్నద్ధం చేశారన్నారు. గాలుల వల్ల విద్యుత్ తీగలు తెగిపోయే ప్రమాదం ఉండడంతో విద్యుత్ సరఫరాను నిలిపేశారని, పునరుద్ధరించడానికి సమయం పడుతుందన్నారు. ప్రజలు నివాసాల్లో తాగునీటిని నిల్వ చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మత్స్యకారులు, రొయ్యల గుంతల వద్ద పనులు చేసే వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రజలు రెండు రోజులు పాటు ఇంటిలోనే ఉండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.


బిట్రగుంట: తీరంలో పరిస్థితిని సమీక్షిస్తున్న కావలి డీఎస్పీ వెంకటరమణ


కచిరిదేవరాయపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు సుభాషిణి


సంగం: వర్షం కురుస్తున్న దృశ్యం


సంగం: 33కేవీ మెయిన్‌లైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


కరటంపాడు పునరావాస కేంద్రంలో సేవలందిస్తున్న వీఆర్‌ఓ ప్రతాప్, కార్యదర్శులు షఫీ, ఎల్‌వీ ప్రసాద్


వింజమూరు ఎస్టీ కాలనీలో గుడిసెల్లో ఉన్న వారిని అప్రమత్తం చేస్తున్న తహసీల్దార్ రవీంద్రబాబు


ఆదూరుపల్లిలో జోరుగా కురుస్తున్న వర్షం


కరటంపాడులో గిరిజనులను మాట్లాడుతున్న ఆర్డీఓ కె మధులత


భోజన ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దారు,సర్పంచ్


సంగం : అన్నారెడ్డిపాళెం ఎస్టీ కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీ


సంగం : కోలగట్ల ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు, ఎస్సై నాగార్జునరెడ్డి


రేవూరులో ప్రధాన రహదారిలో కూలిన చెట్లను తొలగిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీనివాసమూర్తి